



విశేష అలంకరణలో నూకాంబిక

ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారిని బాలాలయంలో శ్రావణమాసం సందర్భంగా ఆదివారం వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి తెల్లవారుజామున ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. - అనకాపల్లి టౌన్

ప్లాస్టిక్ నిషేధానికి తొలి అడుగు

బలిఘట్టంలో మార్పు మొదలు

- మార్కెట్లో పాలిథిన్ కవర్లకు బదులు ప్రత్యామ్నాయ కవర్లు
- మాంసం దుకాణాల వద్ద టేకు ఆకుల వినియోగం



బలిఘట్టంలో మాంసాన్ని టేకు ఆకులో పొట్లం కడుతున్న దృశ్యం

నర్సీపట్నం, ఆగస్టు 18: బలిఘట్టంలో ప్లాస్టిక్ నిషేధం వైపు తొలి అడుగులు పడుతున్నాయి. ఆదివారం మాంసం దుకాణాలలో పాలిథిన్ కవర్‌కు బదులు టేకు ఆకుల్లో పొట్లం కట్టి ఇచ్చారు. సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి బలిఘట్టం గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగాసంఘ సభ్యులు, మునిసిపల్ కమిషనర్ రవిబాబు శనివారం వారపు సంతలో కూరగాయ దుకాణాలకు వద్దకు వెళ్లి పాలిథిన్ కవర్లు ఇవ్వవద్దని చెప్పారు. దుకాణాలలో నాసిరకం పాలిథిన్ సంచులు స్వాధీనం చేసుకున్నారు. భావితరాల భవిష్యత్తు కోసం... వస్త్ర సంచులు వాడతాం అనే సందేశంతో ఉన్న స్టిక్కర్లు ఇంటి యజమానికి ఇచ్చి వారితోనే ప్రహరీ గోడలు, గేట్లకు అతికించారు. ఆదివారం మాంసం దుకాణాల వద్ద ప్లాస్టిక్ కవర్ల వినియోగం మానేశారు. టేకు ఆకుల్లో పొట్లాలు కట్టి ఇస్తున్నారు. పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కమిషనర్ పిలుపునిచ్చారు.



ప్లాస్టిక్ కవర్లు వాడబోమని ఇంటి గేటుకు స్టిక్కరు అతికిస్తున్న దృశ్యం

బదిలీల జాతర

ప్రభుత్వ ఉద్యోగుల స్థానచలనానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- నేటి నుంచి దరఖాస్తులకు అవకాశం
- నెలాఖరు వరకు గడువు
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ప్రక్రియ
- సిఫారసు లేఖల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు



విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తారు. బదిలీ కోరుకున్న సమయంలో జీరో సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. నెలాఖరు వరకు సంబంధిత విభాగాధిపతికి అందజేసేందుకు గడువుంది.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో మూడు జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ కోరుకునే వెసులుబాటు కల్పించినట్టయింది. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం జిల్లాల విభజన సమయంలో నగరం నుంచి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వెళ్లిన అధికారులు, ఉద్యోగుల్లో అధికశాతం మంది మైదానం/ నగరానికి రావడానికి ఉత్సాహం చూపిస్తున్నారు.

సిఫారసులకు క్యూలు

బదిలీల కోసం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన వెంటనే అధికారులు, ఉద్యోగులు కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కీలక ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం సిఫారసు లేఖలు పొందేందుకు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా కొందరు అధికారులు/ఉద్యోగులు విశాఖలోని ప్రజాప్రతినిధుల నుంచి ఇప్పటికే లేఖలు తీసుకున్నట్టు సమాచారం.

జీవీఎంసీ పరిధి యూనిట్‌గా..

ఒకే చోట ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగికి బదిలీ తప్పనిసరి. అయితే జీవీఎంసీ పరిధిని మొత్తం ఒక యూనిట్‌గా పరిగణిస్తారని ఉద్యోగులు చెబుతున్నారు. ఉదాహరణకు రెవెన్యూ ఉద్యోగులు కలెక్టరేట్‌తోపాటు విశాఖ పరిధిలోని పలు తహసీల్దార్ల కార్యాలయాల్లో పనిచేసిన కాలాన్ని మొత్తంగా లెక్కిస్తారంటున్నారు. దీని వల్ల నగరంలో రెవెన్యూతో పాటు పలు శాఖల ఉద్యోగులు అనకాపల్లి, పాడేరు ఏజెన్సీకి బదిలీకి అర్హులంటున్నారు. ఏళ్లుగా నగరంలో తిష్టవేసిన ఉద్యోగులు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని ఓ సీనియర్ ఉద్యోగి తెలిపారు. బదిలీల్లో ముందుగా పాడేరు ఐటీడీఏ పరిధిలో ఖాళీలు భర్తీచేయాలని తాజాగా విడుదలచేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. అటు తరువాతే మైదానం/నగరంలో ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఏజెన్సీలో పనిచేసిన ఉద్యోగులు/అధికారులు బదిలీ కోరుకుంటే.. కనీసం రెండేళ్లు అంతకంటే ఎక్కువగా పాడేరు ఐటీడీఏ పరిధిలో సర్వీసు పూర్తిచేసుకున్నవారు, 50 ఏళ్ల వయసు పైబడిన వారు అర్హులు. ఏజెన్సీ నుంచి మైదానానికి వచ్చే ఉద్యోగి/ అధికారి విధిగా అతని స్థానంలో పోస్టింగ్ పొందిన ఉద్యోగి/అధికారికి బాధ్యతలు అప్పగించాలి. అంటే రిలీవర్ వస్తేనే మార్పునకు అవకాశం ఉంటుంది. కాగా ఉద్యోగ సంఘాల్లో బాధ్యులుగా పనిచేసే (అధ్యక్ష, కార్యదర్శి, ఇతర సభ్యులు) ఉద్యోగుల విషయంలో కనీసం తొమ్మిదేళ్ల వరకు ఒకేచోట పనిచేసుకునే అవకాశం కల్పించారు. కానీ విశాఖలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ సంఘాల ఎన్నికలు ఫార్స్‌గా మారాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మినహాయింపులపై అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

తహసీల్దార్లకు వర్తిస్తాయా?

విశాఖ జిల్లాలో గత నెలలోనే తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధిలో తహసీల్దార్ల బదిలీలకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో మూడు వారాలుగా పోస్టింగ్ కోసం నిరీక్షిస్తున్నారు. అయితే శనివారం కోడ్ ఎత్తివేయడంతో ఈ జిల్లాల్లో తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. కాగా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా బదిలీలు చేపట్టాలన్న తాజా ఉత్తర్వుల మేరకు తహసీల్దార్లకు పోస్టింగ్స్ ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ఏజెన్సీలో రెండేళ్లకు పైగా సర్వీసు పూర్తిచేసిన వారు, 50 ఏళ్ల వయసు దాటిన అధికారులను మైదానానికి తీసుకురావాలి. దీనిని పరిగణనలో తీసుకుంటే ఏజెన్సీలో ఈ ఏడాది జనవరి 30 వరకు పనిచేసిన వారంతా మైదానికి రావడానికి అర్హులు. అంతేకాకుండా జిల్లాల విభజన సమయంలో ఇచ్చిన పోస్టింగ్స్‌లో ఉద్యోగులు/అధికారులను మూడు కేటగిరీలుగా విభజించారు. సర్వీసులో అత్యంత సీనియర్లను విశాఖలోనూ, సీనియర్లను అనకాపల్లి, జూనియర్లను అల్లూరి జిల్లాలకు పంపారు. అయితే 2022 ఏప్రిల్ తరువాత జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు వచ్చినపుడు విశాఖ జిల్లాలోనే పోస్టింగ్స్ ఇచ్చారు. వాస్తవంగా వీరిని పాడేరు డివిజన్‌కు పంపాలి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేపడుతున్న నేపథ్యంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో తహసీల్దార్ల పోస్టింగ్స్ కూడా విశాఖ కలెక్టరే చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే ప్రక్రియ పూర్తిచేసిన విశాఖ జిల్లాను కూడా ఈ బదిలీల్లో పరిగణనలోనికి తీసుకుంటారా?, లేక మినహాయింపు ఇస్తారా? అనేది తేలాల్సి ఉంది. కాగా అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తున్న 13 మంది తహసీల్దార్లు విశాఖలో పోస్టింగ్స్ కోసం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

అనకాపల్లి డీఎస్పీగా శ్రావణి

- అప్పలరాజుకు బదిలీ



బదిలీ అయిన డీఎస్పీ ఎస్.అప్పలరాజు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18: అనకాపల్లి డీఎస్పీగా ఎం.శ్రావణిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ విభాగంలో పని చేస్తున్న శ్రావణి అనకాపల్లి డీఎస్పీగా రానున్నారు. కాగా ప్రస్తుతం ఇక్కడ డీఎస్పీగా పని చేస్తున్న ఎస్.అప్పలరాజుకు బదిలీ అయింది. ఆయనను అమరావతిలోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆయన ఇంటెలిజెన్స్ నుంచి అనకాపల్లికి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు.

ఘనంగా లాలం భాస్కరరావు విగ్రహావిష్కరణ



ఎలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం లాలం కోడూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన టీడీపీ సీనియర్ నేత, దివంగత లాలం భాస్కరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, సుందరపు విజయ కుమార్, బండారు సత్యనారాయణమూర్తి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, టీడీపీ నేత ప్రగడ నాగేశ్వ రరావు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- వార్త 5వ పేజీలో..

రక్షాబంధన్..

- అన్నాచెల్లెళ్ల ప్రేమకు ప్రతిరూపం
- నేడు రాఖీ పండగ
- హాట్‌కేకుల్లా గ్రీటింగులు, రాఖీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ అమ్మకాలు - 5లో





చెక్కపై తయారు చేసిన రాఖీ అక్షరాలపై స్వీటు, దీపం, గిఫ్ట్ చెక్కిన దృశ్యం

చెక్కపై రాఖీ వేడుక

నక్కపల్లి, ఆగస్టు 18: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి ఈనెల 19వ తేదీన రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని చెక్కపై రాఖీ అనే అక్షరాలను చెక్కాడు. ఆ అక్షరాలపై స్వీటు, దీపం, ఒక గిఫ్ట్, రాఖీ బొమ్మను తన నైపుణ్యంతో అమర్చాడు. దీనిని తయారు చేయడానికి గంటన్నర సమయం పట్టిందని రవి చెప్పాడు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తుమ్మపాల, ఆగస్టు 18: కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఆ రోజు ఉదయం కలెక్టరేట్ హాల్‌లో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి సమస్యలకు సం బంధించిన వినతులు తీసుకుంటారని పేర్కొన్నారు.

వర్షంతో ఊరట

వరినాట్లు, ఉద్యాన పంటలకు మేలు జరుగుతుందని రైతుల ఆనందం

- ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం

మాడుగుల రూరల్, ఆగస్టు 18: జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం 4.30 గంటల నుంచి ఆరు గంటల వరకు కురిసిన వర్షానికి జనం ఉపశమనం పొందారు. ఇటీవల ఎండ తీవ్రత, ఉక్కపోతకు అల్లాడిన జనం తాజా వర్షానికి ఊరట చెందారు.

ఎండల వల్ల వరినారుమడులు, ఆకుమడులు నీటితడులు అందక ఎండిపోతున్నాయి. వర్షాలు పడితే గానీ ఊపిరిపోసు కోలేవని రైతులు దిగాలు చెందారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి రైతుల్లో ఆశలు చిగురించాయి. వారం రోజుల పాటు వర్షాలు పడితే పంటలకు నీటితడులు అంది గడ్డు పరిస్థితిని దాటవచ్చునని రైతులు చెబుతున్నారు. వరినాట్లు, వ్యవసాయ పనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. వర్షం కారణంగా వాతావరణం చల్లబడడంతో మండల ప్రజలు ఉక్కపోత, వేడిమి నుంచి ఉపశమనం పొందారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.



అనకాపల్లిలో వర్షం



వడ్డాదిలో..

అనకాపల్లిలో..

అనకాపల్లి టౌన్: అనకాపల్లి పట్టణంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. రహదారులు జలమయమయ్యాయి. విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి కింద వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పలేదు. పలు రోడ్లలోని పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో పాదచారులు, వాహనచోదకులు అవస్థలు పడ్డారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పలు రహదారులు చీకటిమయమయ్యాయి. పట్టణవాసులు ఇబ్బంది పడ్డారు.



పాయకరావుపేటలో..

బుచ్చెయ్యపేటలో..

బుచ్చెయ్యపేట: మండలంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఆరు గంటల వరకు భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం కురిసిన వర్షానికి వాగులు పొంగి ప్రవహించాయి. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. నాలుగు వారాలుగా వరుణుడు ముఖం చాటేయడంతో వరి నాట్లు, ఉద్యాన పంటలు దెబ్బతినడంతో ఆందోళనలో ఉన్న రైతాంగానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఈ వర్షం అన్ని పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట: వారం రోజుల తరువాత పాయకరావుపేటలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. గత వారం రోజులుగా పగటి వాతావరణం ఎండకాలాన్ని తలపించడంతోపాటు రాత్రిపూట ఉక్కపోతకు గురై ఇబ్బందులు పడ్డ జనం ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు.

రోలుగుంటలో..

రోలుగుంట: గత నాలుగు రోజులుగా తీవ్ర ఎండవేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో కాస్త ఉమశమనం కలిగింది. గత పది రోజులుగా మెట్ట వరి పొలాలకు నీరు తడులు లేక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కురిసిన వర్షానికి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందాలకు నెలవు విశాఖ

» సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి



కైలాసగిరి కొండపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి, తదితరులు

విశాఖపట్నం, ఆగస్టు 18 : విశాఖ అందాలను అభివర్ణించలేమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కైలాసగిరితో పాటు అక్కడ ఉన్న తెలుగు మ్యూజియంను సందర్శించారు. కొండపై ఉన్న అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. సెల్ఫీ పాయింట్ ప్రాంతంలో కలియతిరిగి సెల్ఫీ తీసుకున్న ఆయన కైలాసగిరి కొండపై నుంచి నగర అందాలను తిలకించారు. కుటుంబ సభ్యులతో కలిసి కొండపై ఉన్న అద్దాల టాయ్ ట్రైన్‌లో ప్రయాణించారు. అలాగే రోప్ వేలో నుంచి తీరాన్ని చూస్తూ సందడి చేశారు. తెలుగు మ్యూజియంను సందర్శించి అక్కడి విశిష్టతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యూజియంలో కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల విశాఖ పర్యటనలో ఎన్నో మధుర స్మృతులను పొందానని గుర్తు చేసుకున్నారు. ప్రకృతి సోయగాలకు, సహజ సిద్ధమైన అందాలకు విశాఖ కేరాఫ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్, విశాఖ రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్, తదితరులు ఉన్నారు.

అప్పన్న సన్నిధిలో హోం మంత్రి అనిత

» మెట్ల మార్గంలో వెళ్లి స్వామివారికి మొక్కులు చెల్లింపు



మెట్లమార్గంలో వెళుతున్న మంత్రి అనిత



కప్ప స్తంభం వద్ద అనిత

సింహాచలం, ఆగస్టు 18 : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. తొలుత ఆమె కొండదిగువ తొలిపావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి, కాలినడకను ప్రారంభించారు. మార్గమధ్యంలో సాక్షి ఆంజనేయస్వామిని దర్శించుకుని, సమీపంలోని వేగవతీధార తీర్థాన్ని స్వీకరించి సింహగిరికి చేరుకున్నారు. ఈఓ శ్రీనివాసమూర్తి ఆమెకు ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండప ప్రదక్షిణ చేసిన మంత్రి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా గోదాదేవి దర్శనం అనంతరం పండితులు చతుర్వేద స్వస్తివచనాలతో ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు మెట్ల మార్గం అభివృద్ధికి శ్రీకారం చుట్టగా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మెట్లమార్గం అభివృద్ధి పనులను పునఃప్రారంభించినట్టు చెప్పారు.

ఎలమంచిలిలో వీక్లీ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ పట్ల హర్షం



ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ఆగిన వీక్లీ ఎక్స్‌ప్రెస్ వద్ద ఉన్న ఉద్యోగులు, వ్యాపారులు

ఎలమంచిలి, ఆగస్టు 18: ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వడంతో ఆదివారం స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్‌లో విశాఖ, ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వడం పట్ల డైలీ ప్యాసింజర్స్ ప్రతినిధులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారులు స్టేషన్‌కు వచ్చి ఆనందం వ్యక్తం చేశారు. ఎక్స్‌ప్రెస్ రైలు హాల్ట్‌కు కృషి చేసిన రైల్వే అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు జాబ్‌మేళా రేపు

విశాఖపట్నం, ఆగస్టు 18: రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ఆదేశాలతో కంచరపాలెంలో గల ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 20వ తేదీ మంగళవారం పాలిటెక్నిక్ డిప్లొమా హోల్డర్స్‌కు మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో గ్లోబల్ సంస్థ ఆటోలివ్ డిప్లొమా ట్రైనీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ లేదా ఎలక్ట్రానిక్ విభాగాల్లో 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులై ఉండాలి. ఎంపికైన అభ్యర్థుల వార్షిక వేతనం రూ.2.36 లక్షలు చెల్లించనున్నారు. చెన్నైలోని కాంచీపురంలో ఉద్యోగం చేయడానికి సిద్ధపడాలి. గతంలో రిజిస్ట్రేషన్లు చేయని అభ్యర్థులు కూడా మేళాకు హాజరుకావచ్చు. ఆసక్తి అభ్యర్థులు 20వ తేదీ ఉదయం 9 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు

» వచ్చే నెలలో మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, ఆగస్టు 18: దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. వచ్చే నెల (సెప్టెంబరు) 2, 9, 16, 23న ఎర్నాకులం - పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643); వచ్చే నెల 11, 13, 18, 20, 25,27న బెంగళూరు - గువహటి ఎక్స్‌ప్రెస్ (12509); వచ్చే నెల 2, 4, 6, 7, 9, 11, 13, 14, 16, 18, 20, 21, 23, 25, 27, 29న ముంబాయి - భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019) రైళ్లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి.

అలాగే, వచ్చే నెల 7, 14, 21, 28న హటియా- ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (18637); వచ్చే నెల 3, 8, 10, 15, 17, 22, 24, 29న హటియా-ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835); వచ్చే నెల 6, 13, 20, 27న టాటానగర్-ఎస్ఎంవీ బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (12889) రైళ్లు వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడల మీ దుగా నడుస్తాయి.

కాగా, వచ్చే నెల 5, 12, 19, 26న టాటా - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111); వచ్చే నెల 2, 11, 18, 25న జసిదిహ్ - తంబరం ఎక్స్‌ప్రెస్ (12376); వచ్చే నెల 2, 9, 16, 23న హటియా - ఎర్నాకులం ఏసీ ఎక్స్‌ప్రెస్ (22837) రైళ్లు వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి. అయితే, ఈ రైళ్లకు మార్గంలోని ఏలూరు స్టేషన్ హాల్ట్‌ను తొలగించారు. అలాగే, వచ్చే నెల 2, 29న ధనబాద్ - అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351) వయా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తుంది. అయితే ఈ రైలుకు మార్గంలోని తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్ల హాల్ట్‌ను తొలగించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

అన్నాచెల్లెళ్ల ప్రేమకు ప్రతిరూపం

నేడు రాఖీ పండగ

రక్షాబంధన్



హాట్‌కేకుల్లా గ్రీటింగులు, రాఖీలు, గిఫ్ట్ ఆర్టికల్స్ అమ్మకాలు





విశాఖపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): **హిందూ ధర్మం చక్కని మార్గాన్ని చూపిస్తోంది. వేదాలలో వున్న సనాతన ధర్మాలను అవగాహన చేసుకుంటే నేటి సమాజంలో మనిషి మార్గానికి దిశానిర్దేశం అవగతమవుతోంది. ఇంటికొచ్చిన ఆడపడుచును ఆదరించి పంపించాలనే హిందూ ధర్మానికి ప్రతీకగా రాఖీ పండుగను చెప్పుకోవచ్చు. రక్షణ కోరిన మహిళకు రక్షాకవచంగా నిలుస్తానని సోదరుడు అభయమివ్వడమే రాఖీ పండుగ పరమార్థం. ఈ విధంగా రక్షా బంధనం సోదరభావాన్ని పంచుతోంది.**

సోదర, సోదరీమణుల మధ్య అంతులేని ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే పండగ రక్షా బంధన్. ఈ పండగను ఏటా శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున జరుపుకుంటారు. రాఖీ రోజున ప్రతి సోదరి తన సోదరుడికి రాఖీ కడుతుంది. తన సోదరుడు ఆరోగ్యంగా ఉండడంతోపాటు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తనకు అండగా, రక్షణగా నిలవాలని ఆకాంక్షిస్తారు. కష్టసుఖాల్లో తానున్నానన్న భరోసాను ప్రతి సోదరుడు తన అక్కాచెల్లెళ్లకు ఇస్తాడు.

ఏళ్ల నుంచి నిర్వహణ

రక్షా బంధన్ వేడుకలను ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు. రాఖీ ఎప్పటి నుంచి మొదలైందనే దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ అనేక కథనాలు మాత్రం ప్రచారంలో ఉన్నాయి. వ్యాస భగవానుడు రచించిన విష్ణు పురాణం ప్రకారం రాఖీ పౌర్ణమిని బలేవా అని కూడా పిలుస్తారు. ఇందుకు ప్రత్యేక కారణం ఉన్నట్టు చెబుతారు. బలిచక్రవర్తి మహా విష్ణువు భక్తుడు. బలిచక్రవర్తి అపారమైన భక్తితో విష్ణుమూర్తిని తన వద్దే ఉంచుకున్నాడు. విష్ణుమూర్తి లేని వైకుంఠం వెలవెలబోతుండడంతో ఆలోచించిన శ్రీమహాలక్ష్మి రాఖీ పౌర్ణమి రోజున బలిచక్రవర్తికి రాఖీ కట్టింది. లక్ష్మీదేవి రాఖీ కట్టగానే బహుమతిగా ఏం కావాలో కోరుకోమని బలి చక్రవర్తి కోరాడు. అప్పుడు లక్ష్మీదేవి.. విష్ణుమూర్తిని తనతో పాటు వైకుంఠానికి పంపాలని కోరగా, ఆయన సమ్మతించాడు. అప్పటి నుంచే రాఖీ కట్టే సంప్రదాయం ఆరంభమైందన్న ప్రచారం ఉంది. మహాభారతంలో ద్రౌపది వస్త్రాపహరణం సమయంలో శ్రీకృష్ణుడిని తలచుకుంటుంది. అప్పుడు కృష్ణుడి సాయంతో ద్రౌపది అవమాన భారం నుంచి తప్పించుకుంటుంది. అన్నాచెల్లెళ్ల బంధానికి గుర్తుగా ద్రౌపది శ్రీకృష్ణునికి రాఖీ కట్టిందని కూడా చెబుతారు. ఇలా అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

రాఖీ అంటే అర్థం అదే..

రాఖీ అంటే రక్షణ అని అర్థం. తమ సోదరులకు ఎలాంటి ఆపదలు, అవాంతరాలు రాకుండా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షిస్తూ ప్రతి ఆడపడుచు తన అన్నదమ్ములకు కట్టే రక్షను రాఖీగా చెబుతారు. తమ శ్రేయస్సును, అభ్యున్నతిని కోరుకునే అక్కాచెల్లెళ్లకు రాఖీ పండగ సందర్భంగా కానుకలిచ్చి ఆనందంగా ఉండేలా చేయడం ఆనవాయితీగా వస్తోంది. రాఖీ పౌర్ణమి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. సోమవారం రాఖీ పండగను నిర్ణీత సమయంలో జరుపుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఉదయం 9 గంటలు నుంచి 10.30 గంటలలోపు రాఖీ కట్టడానికి ముహూర్తంగా చెబుతున్నారు.

ప్రత్యేక బహుమానాలు

రాఖీ పండగ నేపథ్యంలో నగర పరిధిలో వివిధ రకాల రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గడిచిన మూడు రోజుల నుంచి ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి మరీ అమ్మకాలు జరుపుతున్నారు. పది రూపాయల నుంచి రూ.రెండు వేలు, అంతకుమించి (కస్టమైజ్డ్)న ధరల్లో రాఖీలు లభ్యమవుతున్నాయి. రక్షా బంధన్ నేపథ్యంలో స్వీట్స్, డ్రైఫ్రూట్స్ విక్రయాలు కూడా పెరిగాయి. రాఖీలతోపాటు ప్రత్యేకమైన బహుమతులతో కూడిన గిఫ్ట్ ఐటమ్స్ విక్రయాలు ఆశాజనకంగా సాగుతున్నాయి. సోదరీ సోదరులకు ఇచ్చేందుకు అనుగుణంగా స్మార్ట్ వాచ్, పెన్స్, బ్యాగ్స్, చాక్లెట్ బాక్సెస్, డిజైన్డ్ ఫొటో ఫ్రేమ్స్, వ్యాలెట్స్, డిజైన్ కాయిన్స్, నేమ్ బోర్డ్స్, గిఫ్ట్ కాంబో బాక్సెస్, కస్టమైజ్డ్ మగ్స్, డిజైన్డ్ వాటర్ బాటిల్స్, మేకప్ కిట్స్ వంటివి విక్రయిస్తున్నారు.





రాఖీ స్టాళ్ల వద్ద కొనుగోలుదారులు

నేడు సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి లా వర్సిటీ సందర్శన



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ డి సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఆగస్టు 18: స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాన్ని డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ చాన్సలర్, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరి సోమవారం ఉదయం సందర్శించనున్నారని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి సూర్యప్రకాశరావు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. 'నావిగేషన్ లా స్కూల్ అండ్ లీగల్ ప్రొఫెషన్' అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు. అనంతరం ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ చైర్,సెంటర్‌ను ఆయన ప్రారంభిస్తారన్నారు. ప్రస్తుతం వర్సిటీలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ, ఎల్.ఎల్.బి(హానర్స్)తో పాటు ఎల్ఎల్ఎమ్ (ఒక ఏడాది) కోర్సు, పీహెచ్‌డీ, పీహెచ్‌డీ (ఎగ్జిక్యూటివ్), ఎల్ఎల్‌డీ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ నందిని సీపీ పాల్గొన్నారు.

మాధవపెద్దిని సత్కరించిన మాజీ మంత్రి దాడి



మాధవపెద్ది సురేశ్‌ను సత్కరించిన దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18: సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేశ్‌ను మాజీమంత్రి దాడి వీరభద్రరావు ఆదివారం సత్కరించారు. జిల్లాలో జరిగే కార్యక్రమానికి హాజరైన మాధవపెద్ది సురేశ్.. మాజీ మంత్రి దాడి వీరభద్రరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాధవపెద్దిని దాడి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సినీ సంగీత విషయాలపై చర్చించుకున్నారు.

'పేట'ను వీడని ట్రాఫిక్ సమస్యలు

» ట్రాఫిక్‌లో ఇరుక్కున్న 108 వాహనం

» రోడ్డుపై వర్షపు నీటితో ఇబ్బంది పడిన ప్రజలు



చిత్రమందిర్ సెంటర్‌లో నిలిచిపోయిన 108 వాహనం

పాయకరావుపేట, ఆగస్టు 18: పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. రోడ్డుపై వాహనాలు, తోపుడు బళ్ళు నిలుపుతుండంతోపాటు పట్టించుకున్నవారులేక ఉదయం, సాయంత్రం సమయంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి తాండవ వంతెన నుంచి సూర్యమహల్ సెంటర్ వరకు సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో 108 వాహనంతోపాటు ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. స్థానిక తాండవ వంతెన నుంచి వై జంక్షన్ వరకు 1.9 కిలోమీటర్లు పొడవు, సుమారు 100 అడుగుల వెడల్పు ఉన్న మెయిన్‌రోడ్డు ఇప్పటికే ఇరువైపులా ఆక్రమణలతో కుంచించుకుపోయి తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గతేడాది మెయిన్‌రోడ్డును అభివృద్ధి చేసిన అధికారులు ఆక్రమణలను తొలగించకపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కడ గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దీనికితోడు ఉదయం, సాయంత్రం హెటిరో కంపెనీ బస్సులు, ఆటోలు మెయిన్‌రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ నిలిపి సర్వీస్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. ఆదివారం రాత్రి తాండవ వంతెన నుంచి సూర్యమహల్ సెంటర్ వరకు వాహనాలు నిలిచిపోయి సుమారు గంటపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతోపాటు వర్షం పడి రోడ్డుపై నీరు నిలిచిపోవడం ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ట్రాఫిక్ సమస్యతో నిలిచిపోయిన వాహనాలు

సందడిగా మరిడిమాంబ ఘటాల ఊరేగింపు



ఘటాలతో ఊరేగుతున్న ఎమ్మెల్యే, కమిటీ ప్రతినిధులు, భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18: స్థానిక కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి ఘటాల ఊరేగింపు ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఉత్సవమూర్తిని తలపై పెట్టుకుని ఊరేగారు. ఈనెల 22వ తేదీన అమ్మవారి ఉత్సవం జరగనున్న నేపథ్యంలో ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పురవీధుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోట్ని పూర్ణ చంద్రరావు, తలారి లక్ష్మీప్రసాద్, పీలా నాగశ్రీను, కోట్ని కొండలరావు, ఇలాపు శ్రీనివాసరావు, నగిరెడ్డి మధు, కోట్ని రాంబాబు, కోట్ని అయ్యన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లాలం భాస్కరరావు విగ్రహావిష్కరణ



లాలం భాస్కరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయకుమార్, తదితరులు

రాంబిల్లి, ఆగస్టు 18: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత స్వర్గీయ లాలం భాస్కరరావు విగ్రహావిష్కరణ ఆదివారం పార్టీ శ్రేణులు, లాలం కుటుంబ సభ్యులు, అభిమానుల నడుమ ఘనంగా జరిగింది. మండలంలోని లాలంకోడూరులో లాలం భాస్కరరావు విగ్రహాన్ని ఎంపీ సీఎం రమేశ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ, కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, ఎలమంచిలి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ లాలం భాస్కరరావు కార్యక్రమం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలియజేయడంతో ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారన్నారు. భాస్కరరావు రాజకీయ నేతగానే కాకుండా సేవా దృక్పథం కలిగిన మహోన్నత నేత కొని యాడారు. అనంతరం ఎమ్మెల్యేలు లాలం సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాలలకు కంప్యూటర్లు, యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తాతయ్యబాబు, దూళి రంగనాయకులు, ముత్యాలపాప, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలుపాల్గొన్నారు.

బాబోయ్.. వానరాలు

» మిలట్రీ కాలనీ, కొత్తపేట, ఏఎస్ఆర్ కాలనీల్లో సంచారం

» కౌన్సిల్ తీర్మానం చేసినా స్పందించని అధికారులు

» పదేళ్ల తర్వాత పట్టణవాసులకు పాట్లు

భయభ్రాంతులకు గురిచేస్తున్న కోతులు



ఎలమంచిలి పట్టణం కొత్తపేట ప్రధాన రోడ్డుపై విచ్చలవిడిగా సంచరిస్తున్న వానర మూక



ఎలమంచిలి మిలట్రీ కాలనీలో కారుపై కోతులు

ఎలమంచిలి, ఆగస్టు 18 : పట్టణ ప్రజలను వానర మూకలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల మూక సంచారంతో గృహిణులు, వ్యాపారులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పదేళ్ల క్రితం వానర మూక దాడులతో అల్లాడిన పట్టణ జనానికి ఇప్పుడా సమస్య మళ్లీ ఎదురవడంతో అలజడికి గురవుతున్నారు. దారిన పోయే వారిపై కూడా కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. పదేళ్ల క్రితం పట్టణంలో వానర మూక విపరీతంగా పెరిగిపోవడంతో అప్పటి పాలకవర్గం, అధికారులు కోతులను పట్టించి అటవీప్రాంతాలకు తరలించారు. ఏడాది నుంచి కోతుల సమస్య మరలా తెర మీదకు వచ్చింది. రెండు నెలల క్రితం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కోతులను పట్టించేందుకు తీర్మానం చేసినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా వానరాల దాడులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి ప్రవేశించి వస్తు సామగ్రిని, తినుబండారాలను నాశనం చేస్తున్నాయి. ప్రతిఘటించిన గృహిణులను గాయపరుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లోని చిరు వ్యాపారుల సముదాయంలోకి ప్రవేశించి వ్యాపార సామగ్రిని నష్టపరుస్తున్నాయి. దీంతో కోతుల నుంచి రక్షించుకునేందుకు చేతిలో కర్ర పట్టుకుని దుకాణం ముందు ఒకరు ఉండాల్సి వస్తుందని కొందరు వ్యాపారులు వాపోతున్నారు. మునిసిపాలిటీలో ప్రధానంగా మిలట్రీ కాలనీ, కొత్త పేట, నాగేంద్రకాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ వంటి ప్రాంతాల్లో కోతుల మూక తిష్ట వేసి ఉంటున్నాయి. ఇళ్ల ప్రాంగణంలోని పండ్ల చెట్లను, పువ్వుల మొక్కలను పాడు చేస్తున్నాయి. వీధుల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైన వీటి ప్రతాపం చూపుతున్నాయి. కోతుల మూక దాడుల నుంచి రక్షించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



వానర మూక దాడి నుంచి రక్షించుకునేందుకు చేతిలో కర్ర పట్టుకుని ఉన్న చిరు వ్యాపారి

ఊరూరా శునకాల బెడద

▸ రేయింబవళ్లు గుంపులుగా సంచారం ▸ కనిపించిన వారికి కాట్లు ▸ బెంబేలెత్తుతున్న జనం

చిన్న పిల్లలను బయటకు పంపాలంటే భయం. ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే హడల్.. చీకటి పడ్డాక వీధిలోకి రావాలంటే దడ.. ఇవీ ప్రస్తుతం పలు పల్లెల్లో పరిస్థితులు. ఇంతగా ప్రజలు భయాందోళన చెందేది రౌడీలకో.. గూండాలకో కాదు.. వీధి కుక్కలను చూసి అంటే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. గ్రామ గ్రామాన ఇవి గుంపులు గుంపులుగా సంచరిస్తూ గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు దృష్టిసారించ లేకపోతున్నారు. ఈ సమస్య ఏళ్ల తరబడి ఉన్నా ఏమీ చేయలేని నిస్సహాయస్థితి. ఫలితంగా కొందరు వీటి కాటుకు గురై ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతుండడం పరిపాటిగా మారింది.





అచ్యుతాపురంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

అచ్యుతాపురం ఆగస్టు 18 : మండలంలో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా అచ్యుతాపురం, రామన్నపాలెం, మోసయ్యపేట, వెదురువాడ తదితర గ్రామాల్లో వీటి సంచార అధికంగా ఉంది. రామన్నపాలెం, చీమలాపల్లి తదితర గ్రామాల్లో కుక్కలు పగలంతా పొలాల్లో చెట్ల కింద ఉంటున్నాయి. చీకటి పడేసరికి గ్రామాల్లోకి చొరబడి అలజడి సృష్టిస్తున్నాయి. ఇళ్ల వద్ద, రైతుల పొలాల్లోని కోళ్లు, ఆవుదూడలు, మేకలు, గొర్రెలపై దాడి చేసి పీక్కుతింటు న్నాయి. ఎవరైనా రాత్రిపూట ఒంటరిగా కనిపిస్తే వెంటపడి భయపెడుతున్నాయి. కొందరిని కాటు వేశాయి కూడా. అలాగే, ద్విచక్ర వాహనంపై ఎవరైనా వెళితే వారిని వెంబడిస్తున్నాయి. వీడికి భయపడిన పలువురు డ్రైవింగ్ చేస్తూ కంగారులో ప్రమాదాలకు గురై గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మండల కేంద్రమైన అచ్యుతాపురంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అచ్యుతాపురం, మోసయ్యపేట పంచాయతీలు కలిసే ఉంటాయి. ప్రస్తుతం అచ్యుతాపురం జంక్షన్‌గా పేరుగాంచిన నాలుగురోడ్ల కూడలి మోసయ్యపేట పంచాయతీలోనిదే. ఈ రెండు పంచాయతీల పరిధిలో అధిక సంఖ్యలో చికెన్ దుకాణాలు ఉన్నాయి. వాటి వ్యర్థాలను పలువురు వ్యాపారులు ఎక్కడికక్కడ పడేస్తున్నాయి. వాటిని తిని కుక్కలుమరీ చెలరేగిపోతున్నాయి. కొన్ని హోటళ్లు, తినుబండారాల షాపుల వద్ద కూడా ఇష్టారాజ్యం పడేస్తుండడంతో వీటి సంచారం ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది.

రాంబిల్లిలో రౌడీ మూకల్లా..



రాంబిల్లిలోని ప్రధాన జంక్షన్‌లో గుంపు

రాంబిల్లి : వీధికుక్కల బెడద మండలంలోని పలు గ్రామాల్లో అధికంగా ఉంది. ఎక్కడికక్కడ ఇవి గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయపెడుతున్నాయి. రాంబిల్లి, నేవీకాలనీ, అప్పన్నపాలెం, సంతపాలెం, కొండవారపాలెం, లోవపాలెం, గజిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం, వెల్చూరు, లాలంకోడూరు, దిమిలి, తదితర గ్రామాల్లో వీరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా సంచరిస్తున్నాయి. ఇళ్ల వద్ద, తినుబండారాల షాపుల వద్ద, చికెన్, మటన్ దుకాణాల వద్ద పారబోసిన వాటిటి ఎగబడి తింటున్నాయి. ఆ సమయంలో వాటిని ఎవరైనా అదిరించాలని చేస్తే వారిపై దాడిచేసి కాటువేస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ఈ గుంపులు కోళ్లు, మేక పిల్లలు, లేగదూడలు తదితరాలను సైతం పీక్కుతింటున్నాయి. దీంతో జనం హడలిపోతున్నారు.



చినదొడ్డిగల్లు ప్రధాన రహదారిపై...

నక్కపల్లిలో కనిపించేవారిపై నిచ్చెన..

నక్కపల్లి : వీధి కుక్కలను చూసి మండలంలోని పలు గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరి నోట విన్నా వీటి బెడద అధికంగా ఉందనే మాటే వినిపిస్తోంది. మండల కేంద్రమైన నక్కపల్లి, చినదొడ్డిగల్లు, గొడిచెర్ల, గుల్లిపాడు, ఉపమాక, రాజయ్యపేట, జానకయ్యపేట, సీహెచ్.ఎల్.పురం, నెల్లిపూడి, ఉద్దండపురం, కాగిత తదితర గ్రామాల్లో రోడ్లపై గుంపులు, గుంపులుగా సంచరిస్తున్నాయి. పిల్లలు పాఠశాలలకు రాకపోకలు సాగించే సమయాల్లో వీటి అలజడిని చూసి హడలిపోతున్నారు. రాత్రి వేళల్లో నడిచి వెళ్లేటప్పుడు చేతిలో కర్రలేకపోతే కుక్కలు వెంబడిస్తున్నాయని పలువురు చెబుతున్నారు. నక్కపల్లి ఆస్పత్రికి వచ్చే రోగుల్లో ఇటీవల కాలంలో సగటున వారానికి ముగ్గురు లేదా నలుగురు కుక్కకాట్లకు గురైన వారు ఉంటున్నారని ఆస్పత్రి వైద్యులు చెపుతున్నారంటే వీటి ఆలజడిని అర్థం చేసుకోవచ్చు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వీటిని పట్టుకుని, దూరంగా అటవీ ప్రాంతాల్లో విడిచి పెట్టేలా చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు.

కోటవురట్లలో అరుస్తూ.. కరుస్తూ..



కోటవురట్లలో...

కోటవురట్ల : మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు భయపెడుతున్నాయి. కోటవురట్ల, గొట్టివాడ, పందూరు, చౌడువాడ, జల్లూరు, బీకే పల్లి, పాములవాక, కె.వెంకటాపురం తదితరాల్లో వీటి బెడద మరింత అధికంగా ఉంది. గతంలో పలు పంచాయతీల్లో ప్రజారోగ్య విభాగం కుక్కలను పట్టుకుని దూరప్రాంతాల్లో విడిచిపెట్టడమో లేదా వధించడం వంటి చేసేవారు. కుక్కలను చంపడం అమానుషమంటూ బ్లూక్రాస్ సంస్థ హైకోర్టును ఆశ్రయించడంతో కుక్కలను చంపవద్దంటూ కోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటినుంచి వీటి జోలికి ఎవరూ వెళ్లడం మానేశారు. దీంతో పంచాయతీల్లో వీటి సంఖ్య మరింత పెరిగింది. కుక్కల ఉత్పత్తిని నియంత్రించేందుకు పట్టణాల్లో, మునిసిపాలిటీల్లో ఆపరేషన్లు చేసినా గ్రామస్థాయిలో ఇది పెద్దగా అమలుకు నోచుకోలేదని అంటున్నారు. మండలంలో కుక్కల బెడద లేని ప్రాంతం అంటూ లేదని పలువురు అంటున్నారు. రాత్రి సమయాల్లో నర్సీపట్నం నుంచి రేవుపోవరం వెళ్లే రహదారి మొదలుకొని దాదాపు అన్ని రోడ్లలో ఈ కుక్కలు సంచరిస్తూనే కనిపిస్తున్నాయి.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయండి

▸ ఎస్ఎంసీ ఎన్నికల్లో విజేతల అభినందన సభలో కూటమి నేతలు



ఎస్ఎంసీ ఎన్నికల్లో విజేతలను అభినందిస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, ఆగస్టు 18 : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. శనివారం మండలంలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో గెలుపొందిన వారికి ఆదివారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటైంది. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గెలుపొందిన ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్టు చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, మంచి ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు అంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పార్టీ నాయకులు దేవవరపు రఘు, టీడీపీ నాయకులు యాళ్ల వరహాల బాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, పల్లా విలియంకేరి, మజ్జూరి నారాయణరావు, ఉరుకుట్ల వెంకటరమణ, కట్టా శ్రీను, వేములపూడి అప్పారావు తదితరులతో పాటు అధిక సంఖ్యలో టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

80వ వార్డులో కూటమి నాయకుల పర్యటన



రక్షిత మంచినీటి పథకం ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 : జీవీఎంసీ 80వ వార్డులో కూటమి నాయకులు ఆదివారం పర్యటించారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు, జనసేన ఇన్‌చార్జి మళ్ల శ్రీను ఆధ్వర్యంలో ముత్రాసుకాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ శుభ్రం చేయకపోవడం వల్ల నీరుసరిగా రావడం లేదని తక్షణమే శుభ్రం చేయించాలని స్థానికులు కోరగా, జీవీఎంసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని జోగినాయుడు, శ్రీను తెలిపారు. అలాగే మరికొందరు స్థానిక సమస్యలను వివరించారు. ఈ పర్యటనలో కూటమి నాయకులు దూలం ప్రసాద్, బొడ్డేడ మురళీ, కర్రి మల్లేశ్వరరావు, ఎ.కౌశిక్, బుద్ధ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన అనకాపల్లి మండలం సర్పంచుల సంఘ కార్యవర్గ సభ్యుల

తుమ్మపాల, ఆగస్టు 18 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఆదివారం అనకాపల్లి మండలం సర్పంచుల సంఘ కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా రాపేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సాలాపు శాంతి సూరిఅప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తట్టా పెంటయ్యనాయుడు, కోశాధికారిగా యల్లపు వెంకట రమేష్ డైరెక్టర్లగా కరణం రెవెన్యూ నాయుడు, మువ్వల రాము, నందవరపు సూరిబాబు, కొల్లుమళ్ళ గోవిందరావు, మజ్జి వెంకటఅప్పారావులను ఎన్నుకున్నారు. అలాగే, మీడియా కన్వీనర్‌గా సప్పారపు వరహాలబాబు ఎన్నికయ్యారు. అనంతరం సంఘం బలోపేతానికి, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి అంతా కట్టుబడి ఉన్నామని తీర్మానం చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

సబ్బవరం, ఆగస్టు 18 : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం వచ్చే నెల రెండో తేదీన జరగనున్న నేపథ్యంలో జనసేన నేతలు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు బలిరెడ్డి అప్పారావు, కనకరాజు మాట్లాడుతూ చిరంజీవి జన్మదినం రోజు ఈ నెల 22న పోటీలను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, గండి దుర్గాప్రసాద్, బలిరెడ్డి రామకృష్ణ, ఉగ్గిన రాము, టి.శేఖర్, వెంకట్, జెట్టి ప్రసాద్, బాదిరెడ్డి సత్యనారాయణ, బగ్గు ఈశ్వరరావు పాల్గొన్నారు.

అంధకారంలో అనకాపల్లి పట్టణం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 : పట్టణంలో అంధకారం అలముకుంది. ఆదివారం సాయంత్రం 6.15 గంటల సమ యంలో ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరాకు నిలిచిపోయింది. ఈ కారణంగా గవరపాలెంతో పాటు జాతీయ రహదారిలో విద్యుత్ సరఫరాకు సుమారు రెండు గంటలకు పైగా అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా పలు రహదారుల్లో ఏర్పడిన గోతుల్లో నీరు చేరింది. చీకటి వల్ల ఇది గుర్తించలేని పలువురు వాహనచోదకులు చిన్నచిన్న ప్రమాదాలకు గుర య్యారు. రెండున్నర గంటల తరువాత కొన్నిచోట్ల సరఫరాను పునరుద్ధరించారు.

అవినీతికి వ్యతిరేకంగా 'జైభారత్' పోరాటం



కోటవురట్లలో సమావేశమైన సంస్థ ప్రతినిధులు

కోటవురట్ల, ఆగస్టు 18 : జైభారత్ అనకాపల్లి జిల్లా సమావేశాన్ని ఆదివారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు సంస్థ జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా జైభారత్ పనిచేస్తున్నట్టు చెప్పారు. సమాజంలో అసమానతలకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల సాధనకు పోరాటం చేస్తున్నట్టు వివరించారు. అనంతరం అనకాపల్లి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాసరపు అర్జున్‌రావు, ఉపాధ్యక్షుడిగా డి.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల సత్యనారాయణ, కార్యదర్శులుగా ఎస్‌కే జిలానీ, జి.లోవరాజు ఎన్నికయ్యారు.

మట్టి గణపతిని పూజించాలంటూ ప్రచార ర్యాలీ



మట్టి వినాయక ప్రతిమలతో ర్యాలీ చేస్తున్న కమిటీ ప్రతినిధులు, భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 : వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలతో పూజలు చేయాలంటూ వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకులు ఆడారి కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ప్రచార ర్యాలీ జరిగింది. 'మట్టి గణపతిని పూజించండి.., స్వామి కృపకు పాత్రులు కండి.., పర్యావరణాన్ని పరిరక్షించండి.., ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను విడనాడండి' అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. చిన నాలుగురోడ్ల జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు, పురవీధుల మీదుగా ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో కడిమిశెట్టి రాజు, పిసోమశేఖర్ పట్నాయక్, దాడి బుజ్జి, పెంటకోట వర ప్రసాద్, కర్రి భరత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి ఎమ్మెల్యే ప్రోత్సాహం

పరవాడ, ఆగస్టు 18 : తానాం ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్.కౌశికకు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కౌశిక యోగాలో అద్భుత ప్రదర్శనను చూసి ఎమ్మెల్యే ఈ ప్రోత్సాహకాన్ని అందజేసినట్టు పాఠశాల యోగా ట్రైనర్ ఆంజనేయులు తెలిపారు.



కౌశిక

పెదకలవలాపల్లిలో రక్షాబంధన్

రాంబిల్లి, ఆగస్టు 18 : సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెదకలవలాపల్లి ఆలయ ఆవరణలో ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలమంచిలి ఖండ ధర్మా ప్రచారకులు కొల్లి అప్పా రావు ఈ వేడుక ఆవశ్యకతను వివరించారు. మండల కమిటీ సభ్యులు ఎస్.అప్పలకొండ, వై.మంగ, అప్పలరాజు, వరలక్ష్మి, కాంతంలతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే 'పీలా' జన్మదిన వేడుకలు



టీడీపీ కార్యాలయంలో జన్మదిన కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ



పీలాను సత్కరిస్తున్న ఎంపీ సీఎం రమేష్

తుమ్మపాల, ఆగస్టు 18 : మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగాయి. తొలుత ఆయన నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌తో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు పీలాగోవింద సత్యనారాయణ అన్నారు. మున్ముందు ఆయనకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. పీలా జన్మదిన వేడుకలతో ఆ ప్రాంతమంతా కోలాహల వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. భవిష్యత్తులో పీలా ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో జోగినాయుడు జన్మదినం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 : జీవీఎంసీ 80వ వార్డు టీడీపీ కార్యాలయంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు జన్మదిన వేడుకలను శనివారం రాత్రి నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అల్లుడు భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) జోగినాయుడును సత్కరించి, కేకుకట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మళ్ల శ్రీను, కర్రి మల్లేశ్వరరావు, దూలం గోపి, రాపేటి రామ్‌కుమార్, పీలా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



జోగినాయుడును సత్కరిస్తున్న రాంకీ

కోల్‌కతా ఘటనలో నిందితులను శిక్షించాలి

▸ వేర్వేరు చోట్ల నిరసనల్లో సీపీఐ, ఐద్వా ప్రతినిధుల డిమాండ్



నెహ్రూచౌక్ జంక్షన్‌లో సీపీఐ నాయకులు ఆందోళన

తుమ్మపాల, ఆగస్టు 18 : కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించి, నెహ్రూచౌక్ జంక్షన్‌లోని బుద్ధుని విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. దేశంలో రోజురోజుకు విపరీతంగా మహిళల పై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వాల వైఫల్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరాచారి, సత్యనారాయణ, పోతురాజు, రామారావు, బాబ్జి, హరీష్, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



గొర్లివానిపాలెం పంచాయతీలో మాట్లాడుతున్న ఐద్వా ప్రతినిధి మాణిక్యం

పరవాడ : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహిళలపై రోజురోజుకి అఘాత్యాలు పెచ్చుమీరిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు శిక్షలను మరింత కఠినతరం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పరవాడ ఏరియా కమిటీ ప్రతినిధులు జి. లక్ష్మి, కె.రమణమ్మ, జి.మణి, వరలక్ష్మి, సన్యాసమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో లక్ష కుంకుమార్చన



సంతోషిమాత పూజల్లో పాల్గొన్న మహిళలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 : గవరపాలెం గౌరీపంచాయతన ఆలయంలోని సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'వైద్యాలయంలో అవినీతిపై చర్యలు చేపట్టాలి'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 18 : ఎన్టీఆర్ వైద్యాలయంలోని ప్రసూతి విభాగంలో అవినీతి అక్రమాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు శనివారం పలువురు వినతి పత్రం అందజేశారు. ప్రసూతి విభాగంలో గర్భిణులకు ప్రసవం జరిగిన తర్వాత వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రజా రాజకీయ వేదిక ప్రతినిధి కనిశెట్టి సురేష్‌బాబు, సీపీఐ ప్రతినిధులు రాజాన దొరబాబు, వైఎస్ భద్రం ఆరోపించారు. పలు సందర్భాల్లో మెడిసిన్ కూడా బయట నుంచి కొనుక్కొని తీసుకురావాలని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి వాటిపై తక్షణమే దృష్టిసారించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణ్, తేలయ్య బాబు, కోరిబిల్లి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

హస్త కళాకారులకు ఉచిత విద్యుత్ కల్పించాలి

ఎలమంచిలి, ఆగస్టు 18 : హస్తకళా నైపుణ్యం ద్వారా జాతీయ స్థాయిలో ఉమ్మడి విశాఖ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలోని హస్త కళాకారులు ప్రభుత్వం తమకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయాల్సిందిగా కోరుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 150 కుటుంబాలు హస్తకళా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. తమకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తే ఈ రంగంలో రాణించడంతో పాటు తమకు కష్టానికి తగిన ఫలితం కాస్తయినా దక్కుతుందని అంటున్నారు. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేనేత రంగానికి అందిస్తున్నట్టుగానే హస్తకళా రంగాన్ని కూడా ఆదుకోవాలని కోరుతున్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న డీజీ నాథ్

పాయకరావుపేట, ఆగస్టు 18 : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఇక్కడి హైమా నేత్రాలయంలో ఆదివారం ఉచిత రెటీనా స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డీసీవో డాక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్, డాక్టర్ సువర్ణ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఏపీ సూర్యనారాయణ, కార్యదర్శి పి.హరికృష్ణ, ఆర్.వీరభద్రరావు, వి.ఉమామహేశ్వరరావు, టి.తాతారావు పాల్గొన్నారు.

రాంకీ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల పంపిణీ

పరవాడ, ఆగస్టు 18 : రాంకీ ఫౌండేషన్, రీసస్టేన బిలిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రావాడలో రైతులకు సేంద్రియ ఎరువుల పంపిణీ చేపట్టారు. సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఏవో సీహెచ్.చంద్రావతి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, కె.శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వియ్యపు చిన్న, మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ చైర్మన్ కోన రామారావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

కోల్‌కతా ఘటనలో

దోషులకు ఉరిశిక్ష విధించాలి

- రెల్లి మహిళా హక్కుల సాధన కమిటీ విద్యార్థి విభాగం అధ్యక్షురాలు మౌనిక



చెట్టుపల్లిలో మాట్లాడుతున్న మౌనిక

నర్సీపట్నం, ఆగస్టు 18 : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన దోషులకు ఉరి శిక్ష విధించాలని రెల్లి మహిళా హక్కుల సాధన కమిటీ విద్యార్థి విభాగం అధ్యక్షురాలు యర్రంశెట్టి మౌనిక డిమాండ్‌చేశారు. ఆదివారం చెట్టుపల్లిలో ఆందోళన చేపట్టి మాట్లాడుతూ కఠిన చట్టాలు అమలు చేయకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన తర్వాత ప్రభుత్వాలు తూ.తూ. మంత్రంగా స్పందిస్తుండడం తగదన్నారు. ఇప్పటికైనా దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, అమ్మాజీ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నాతవరం, ఆగస్టు 18 : ఆలయాలు ఆధ్యాత్మిక చింతనకు నిలయాలని ఎన్‌ఆర్‌ఐ శెట్టి సతీష్ అన్నారు. నాతవరం ఎస్సీ కాలనీలో నిర్మించనున్న ఆంజనేయ ఆలయానికి ఆదివారం తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తాను, స్నేహితుల సహకారంతో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్.విజయ్ కుమార్, తెలుగుయువత మండల అధ్యక్షుడు శెట్టి లోవ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు శెట్టి నానాజీ, అప్పిరెడ్డి మాణిక్యం, నాయకులు జీరెడ్డి రాజుబాబు, పైల సూరిబాబు, చింతకాయల శ్రీను, శెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం వైపు తొలి అడుగు

- బలిఘట్టం ప్రజలలో మార్పు ఆరంభం
- మార్కెట్లో పాలిథిన్ కవర్లకు బదులు ప్రత్యామ్నాయ కవర్లు
- మాంసం దుకాణాల వద్ద టేకు ఆకులతో పొట్లాలు



ప్లాస్టిక్ కవర్లు వాడమని ఇంటి గేటుకి స్టిక్కర్ అతికిస్తున్న మహిళ



బలిఘట్టంలో మాంసాన్ని టేకు ఆకులో పొట్లం కడుతున్న వ్యాపారి

నర్సీపట్నం, ఆగస్టు 18 : పట్టణంలోని బలిఘట్టంలో ప్లాస్టిక్ నిషేధం వైపు తొలి అడుగులు పడుతున్నాయి. ఆదివారం మాంసం దుకాణాలలో పాలిథిన్ కవర్లకు బదులు టేకు ఆకులతో పొట్లాం కట్టి ఇవ్వడం కనిపించింది. సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి బలిఘట్టంలో ప్లాస్టిక్ నిషేధానికి ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా మునిసిపల్ కమిషనర్ రవిబాబు, సంఘం సభ్యులు శనివారం వారపు సంతలో కూరగాయ దుకాణాల వద్దకు వెళ్లి పాలిథిన్ కవర్లు ఇవ్వ వద్దని సూచించారు. దుకాణాలలో నాశిరకం పాలిథిన్ సంచులు స్వాధీనం చేసుకున్నారు. 'భావితరాల భవిష్యత్తు కోసం ప్లాస్టిక్ కవర్లు వినియోగించం... వస్త్ర సంచులు వాడతాం' అనే సందేశంతో ఉన్న స్టిక్కర్లు ఇంటి యజమానులకు ఇచ్చారు. అంతేకాకుండా వారితోనే ప్రహరీ గోడలు, గేట్లుకు అతికించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పద్మనాభుని కొండల రాయుడు వస్త్ర సంచులను ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. ఆదివారం మాంసం దుకాణాల వద్ద ప్లాస్టిక్ కవర్లు వినియోగం మానేశారు. పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మునిసిపల్ కమిషనర్ పిలుపునిచ్చారు.

ఏఎల్‌పురంలో క్షీణించిన పారిశుధ్యం

- దీర్ఘకాలంగా సమస్య ఉన్నా పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న గ్రామస్థులు



బీసీ కాలనీలో రోడ్డుపైకి చేరిన మురుగు



గొల్లపేటకు వెళ్లే రహదారిలో దుస్థితి

కృష్ణాదేవి పేట, ఆగస్టు 18 : గొలుగొండ మండలంలో మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో పారిశుధ్యం క్షీణించింది. పలుచోట్ల చెత్త పేరుకుపోయి దర్శనమిస్తుండగా, కాలువల్లో మురుగు ముందుకు కదలని దుస్థితి నెలకొంది. కొన్నిచోట్ల రోడ్లపై ప్రవహిస్తుండడంతో పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గత వైసీపీ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. ముఖ్యంగా బీసీ కాలనీ, వినాయకవీధి, గొల్లపేట, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గ్రామంలో మురుగు ఎటుపోలేని దుస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఇళ్ల ముందు తిష్ట వేస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలు దుర్గంధభరితంగా మారడంతో పాటు దోమల బెడద అధికంగా ఉంది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ఇప్పటికైనా ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్థులంతా కోరుతున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లు ఆవిష్కరణ

సబ్బవరం, ఆగస్టు 18 : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం వచ్చే నెల రెండో తేదీన జరగనున్న నేపథ్యంలో జనసేన నేతలు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు బలిరెడ్డి అప్పారావు, కనకరాజు మాట్లాడుతూ చిరంజీవి జన్మదినం రోజు ఈ నెల 22న పోటీలను ప్రారంభిస్తామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు పూర్తి వివరాలకు తమను సంప్రదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, గండి దుర్గాప్రసాద్, బలిరెడ్డి రామకృష్ణ, ఉగ్గిన రాము, టి.శేఖర్, వెంకట్, జెట్టి ప్రసాద్, బాదిరెడ్డి సత్యనారాయణ, బగ్గు ఈశ్వరరావులతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

పాఠశాల చెంతనే ప్రమాద ఘంటిక

- వెంకునాయుడుపేటలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు
- ఎంపీపీ స్కూల్‌ని ఆనుకొని ఉండడంతో విద్యార్థులు ఆందోళన
- కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ ప్రస్తావించినా పట్టని అధికారులు

నర్సీపట్నం, ఆగస్టు 18 : మునిసిపాలిటీలోని 22వ వార్డు వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్‌ను ఆనుకొని ఉన్న మినీ వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ ట్యాంకును వెంటనే తొలగించే ఏర్పాటు చేయక పోతే ప్రమాదమని టీడీపీ కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య గత కౌన్సిల్ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు దీనిపై స్పందించక పోవడంతో ట్యాంక్ ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హడలిపోతున్నారు. 150 మంది విద్యార్థులు చదువుకునే ఎంపీపీ పాఠశాలను ఆనుకొని శిథిలమైన వాటర్ ట్యాంక్ ఉన్నా అధికారులకు పట్టకపోవడం దారుణమని పలువురు వాపోతున్నారు.

పునాదులు బలం లేక వాటర్ ట్యాంకు భవనం ఎంపీపీ పాఠశాల వైపు భూమిలోకి కుంగి పోయి ఉంది. పిల్లర్లు పాడయిపోయి ఊసలు తుప్పు పట్టి పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాటర్ ట్యాంక్ భవనం మరింత పాడైంది. జరగరానికి జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

సర్పంచుల సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన అనకాపల్లి మండలం సర్పంచుల సంఘ కార్యవర్గ సభ్యుల

అనకాపల్లి, ఆగస్టు 18 : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండ వద్ద ఆదివారం అనకాపల్లి మండలం సర్పంచుల సంఘ కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. సంఘం అధ్యక్షుడిగా రాపేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సాలాపు శాంతి సూరిఅప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తట్టా పెంటయ్యనాయుడు, కోశాధికారిగా యల్లపు వెంకటరమేష్, డైరెక్టర్లగా కరణం రెవెన్యూ నాయుడు, మువ్వల రాము, నందవరపు సూరిబాబు, కొల్లుమళ్ళ గోవిందరావు, మజ్జి వెంకటఅప్పారావులను ఎన్నుకున్నారు. అలాగే, మీడియా కన్వీనర్‌గా సప్పారపు వరహాలబాబు ఎన్నికయ్యారు. అనంతరం సంఘం బలోపేతానికి, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి కట్టుబడి ఉన్నామని తీర్మానం చేశారు.

చోడవరం
నియోజకవర్గం

పాఠశాలల అభివృద్ధికి యజమాన్య కమిటీలు కృషిచేయాలి

- చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



జె.నాయుడుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట, ఆగస్టు 18: రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేసి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. మండల కేంద్రం రోలుగుంటలో నూతనంగా ఎన్నికైన పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్లతో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. యాజమాన్య కమిటీలు గ్రామాల్లో పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని కోరారు. రోలుగుంట మండలంలో 90 శాతం పాఠశాలల యాజమాన్య కమిటీలను కూటమి మద్దతుతో ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన యజమాన్య కమిటీ చైర్మన్లను స్థానిక నాయకుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జులు సుర్ల బాబులునాయుడు, సుర్ల రామకృష్ణ, కోలిపల్లి ఈశ్వరరావు, బోడాపాత్రుని నరేష్, బంటు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



నిరసన తెలుపుతున్న పాఠశాలల పారిశుధ్య కార్మికులు

రోలుగుంట, ఆగస్టు 18: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ గత ఐదు నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, జీవో నెం 108 ప్రకారం రూ.11500 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మూడు వేలకు పైగా పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరిని ప్రభుత్వం ఉద్యోగులుగా పరిగణించి గుర్తింపు కార్డులతో పాటు యూనిఫారాలు, ఇతర బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రతీ నెల సకాలంలో జీతాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులతో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాలల పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



రాళ్లు తేలిపోయి గోతులు పడిన మాడుగుల-ఘాట్ రోడ్డు జంక్షన్... రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు

అధ్వానంగా మాడుగుల రోడ్డు

- రహదారి ఆద్యంతం గతుకులు.. ఎక్కడికక్కడే తేలిపోయిన రాళ్లు
- వాహన చోదకులు, ప్రయాణికుల పాట్లు... పట్టించుకోని అధికారులు



రహదారి అంచుల పక్కన నిలిచిపోయిన వర్షం నీరు

మాడుగుల రూరల్, ఆగస్టు 18: నియోజకవర్గ కేంద్రమైన మాడుగుల గ్రామానికి చేరుకునే రహదారి అధ్వానంగా తయారైంది. రహదారి ఆద్యంతం భారీ గతుకులు పడి ప్రమాదకరంగా పరిణమించింది. దీనికితోడు ఎక్కడికక్కడ రాళ్లు తేలిపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు.

ఘాట్ రోడ్డు జంక్షన్ మీదుగా మాడుగులకు చేరుకోవాలి. మాడుగుల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా, రావాలన్నా ఈ రోడ్డే ఆధారం. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన రోడ్డు గుంతలు పడి ఛిద్రంగా మారుతున్నది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును పూర్తిగా పట్టించుకోలేదనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఏదో తూతూమంత్రంగా క్రషర్ బుగ్గిని గోతుల్లో వేసి చేతులు దులుపుకోవడం తప్ప సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి అధ్వానంగా ఉండడంతో ఈ ఏడాది జూన్‌లో మాడుగులలో జరిగిన మోదకొండమ్మ జాతర నిర్వహించే క్రమంలో జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు పండగకు రెండు రోజులు ముందు తూతూమంత్రంగా కంకర రాళ్లు, క్రషర్‌బుగ్గి వేసి చేతులు దులుపేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం గోతులు పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. అడపాదడపా వర్షాలు పడడం, వాహనాల రాకపోకలు కారణంగా గోతుల్లో కంకరరాళ్లు పైకి తేలిపోయి యథావిధిగా గోతులు కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకల కోసం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అంచుల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకుని వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతున్నామని వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పగటి వేళల్లో కంటే రాత్రి సమయంలో గోతుల రోడ్డుపై ప్రయాణం ప్రమాదాలను తలపిస్తున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారి సమస్య పరిష్కారానికి తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



పాడేరు రూరల్, ఆగస్టు 18: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. మన్యంలోని వివిధ గ్రామాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి, మొక్కులు తీర్చుకొనేందుకు రావడంతో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఆలయం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులు క్యూకట్టారు. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. అలాగే పాడేరు ఘాట్‌లోని మోదాపల్లి జంక్షన్‌లోని అమ్మవారి పాదాల వద్దకు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదివాసీ రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు

చింతపల్లి, ఆగస్టు 18: ఆదివాసీ రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేసినట్టు టాటా ట్రస్టు శాస్త్రవేత్త డాక్టర్ అప్పలరాజు తెలిపారు. స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో పసుపు, మిరియాలు పంటల్లో మేలైన సాగు పద్ధతులు అంశంపై ఆదివారం గిరిజన రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు సేంద్రియ పద్ధతుల్లో పసుపు, మిరియాలు సాగు చేసుకునే నూతన పద్ధతులను టాటా ట్రస్ట్ శాస్త్రవేత్తతో పాటు ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ శివకుమార్ వివరించారు. ప్రధానంగా దుంపకుళ్లు, కాండం కుళ్లు తెగుళ్ల నివారణ పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు పంటలకు కషాయాలు పిచికారీ చేసే బ్యాటరీ స్ప్రేయర్లు, ట్రైకోడెర్మా, సుడోమోనస్ క్రిమి సంహారకక మందులను రైతులకు ఉచితంగా అందజేశారు.



రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న టాటా ట్రస్టు శాస్త్రవేత్త

మాడుగుల
నియోజకవర్గం

రైతులకు ఔషధ మొక్కల సరఫరా

కె.కోటపాడు, ఆగస్టు 18: అంతరించిపోతున్న ఔషధ మొక్కలను సంరక్షించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి గల రైతులకు సరఫరా చేయటానికి చర్యలు తీసుకుందని రీజనల్ బయోడైవర్సిటీ కో-ఆర్డినేటర్ జానకిరామ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎంతో మందికి తెలియని 70 రకాల ఔషధ మొక్కలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కరక్కాయ, ఉసిరి, తాడి, మారేడుతో పాటు అంతరించిపోతున్న కొన్ని రకాల పండ్ల జాతుల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా పాఠశాల ఆవరణలో పెంచుకోవడానికి అనువైన రకాల మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే నీటి వసతి గల రైతులు పెంచుకోవడానికి మండల కేంద్రంలోని బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీ తీర్మానం మేరకు మొక్కలు సరఫరా చేస్తామని, మొక్కలను సంరక్షించేందుకు ఖర్చు భరిస్తామని ఆయన తెలిపారు. దీనికి తగిన మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామని చెప్పారు.

ఇంటర్ ప్రవేశాలకు 20 వరకు గడువు

కె.కోటపాడు, ఆగస్టు 18: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి తెలిపారు. విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్టు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జీవీఎంసీ కాలువలో నిర్వహణ పనులు



కాలువలో నాచు తీస్తున్న కార్మికులు

దేవరాపల్లి, ఆగస్టు 18: రైవాడ నుంచి విశాఖ నగర పాలక సంస్థకు నీటిని ససరఫరా చేసే కాలువలో ఆదివారం నిర్వహణ పనులు చేపట్టారు. రైవాడ ఎడమ కాలువ ఒకటో కిలోమీటరు నుంచి 55 కిలోమీటరు వరకు ప్రతీ రోజు కాలువలో నాచును తొలగిస్తారు. రైవాడ నుంచి సూదివలస వరకు 30 కిలోమీటర్లు ఈ ప్రాంత సిబ్బంది, నరవ వరకు మిగతా సిబ్బంది పని చేస్తుంటారు. కాలువలో నిత్యం చెత్త లేకుండా చేస్తుంటారు. పర్యవేక్షకుల సిఫ్ట్ డ్యూటీలో పనులు జరుగుతున్నాయి. ప్రతి రోజూ మూడు కిలోమీటర్ల చొప్పున నాచు తొలగిస్తున్నారు.

కొనసాగిన వైద్యుల ఆందోళన

ముంచంగిపుట్టు, ఆగస్టు 18: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది చేపట్టిన ఆందోళన కార్యక్రమం రెండో రోజు ఆదివారం కొనసాగింది. అత్యవసర వైద్య సేవలు మినహా ఇతర వైద్య సేవలను పూర్తి స్థాయిలో నిలిపివేశారు. నల్ల బ్యాడ్జీలను పెట్టుకొని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఇటువంటి సంఘటనలు జరగ కుండా ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తేడవంతో పాటు ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గీతాంజలి, సంతోష్, ధరణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.